


# ప్రస్థానం

## నందుల సుశీలాదేవి

కొడుకు వచ్చిన శబ్దానికి ముందు వరండాలోకి వచ్చింది విశాలాక్షి. కొత్త పరుపు చుట్ట, సూట్‌కేస్, ఫ్లాస్క్ యింకేవేవో సరంజామా కారు డిక్కీలోనుండి బయటకు తీస్తున్నాడు.

కోడలు బుట్టలో టైంపీస్, మెడిసిన్స్ అన్నీ సర్దుతూ లిస్టు చెక్ చేసుకుంటోంది.

కొడుకు వో పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో మేనేజరు. కోడలు కూడా అదే కంపెనీలో పనిచేస్తోంది.

ఇద్దరూ ఉద్యోగాలు వదిలేసి లండన్‌లో మరో పెద్ద కంపెనీలో పెద్ద పెద్ద జీతాలలో చేరుతున్నారు. వెళ్లారంటే అంత తొందరలో ఇండియా రారు. విశాలాక్షి మనసులో బాధావీచిక చెలరేగింది.

చిన్నతనంలో తల్లి కూడా యిట్లాగే సామాను సర్దేది. తల్లిపేరున్న డాక్టరు! తండ్రికి తరచూ కేంపులుండే ప్రభుత్యోద్యోగం.

పిల్లల్ని బోర్డింగ్ స్కూళ్లలో వుండి చదివిస్తే చక్కటి క్రమశిక్షణతో వుంటారని తల్లి భావన.

తండ్రికూడా తల్లి నిర్ణయాన్నే సమర్ధించేవారు. ఆ రోజూ బెంగగానే వుండేది.

తల్లీ, తండ్రీ వాళ్ల వాళ్ల పని వత్తిడులలో వున్నా తనకి యింట్లో వుండటమే యిష్టం.

తోటలో పరుగులు పెడుతూ, వంటమనిషి అన్నం తినమని బతిమాలుతూవుంటే తోటమాలి గారాబంగా తనను ముద్దుచేస్తూ వుంటే వీళ్లందరినీ వదిలి బోర్డింగు స్కూల్‌కి వెళ్లాలంటే దిగులు దిగులుగా వుండేది. కాని సెలవులకి యింటికి వచ్చేస్తాను. చదువయ్యాక బోర్డింగు వదిలేయవచ్చు. భవిష్యత్తు మీద ఆశ చాలావరకు తనలోని బెంగను తగ్గించేసేది.

ఈ రోజు వెనక్కి రావటం అనేది ఎప్పుడో? అసలు రాగలనో లేదోననే సందేహం.

కొడుకు, కోడలూ ఓ పదిరోజుల్లో లండన్ వెళ్లిపోతారు. కూతురు ఎక్కడో సిమ్లాలో భర్తతో వుంటోంది. అక్కడి చలి వాతావరణం తనకి పడదు. తను వంటరిగా యింట్లో వుండగలను అంటే పిల్లలు అంగీకరించడం లేదు.

సంపన్నుల కోసం హైదరాబాదులో నిర్మించిన వృద్ధాశ్రమంలో తనకు సీటు సంపాదించాడు కొడుకు.

లక్షరూపాయల డిపాజిట్, నెలకు ఆరువేల చొప్పున వాళ్లు రుసుము వసూలు చేస్తారు.

తానూ వెళ్లి చూసి వచ్చింది.

ప్రత్యేకంగా గది. గదిలో ఫోను-టీవి- బటన్



## టైం బాలేదు

ఏక్తాకపూర్ అంటే టి.వి. నటులకు హడల్. ఏ హీరోయిన్‌ని ఎక్కువ రోజులు బుల్లితెరపై వుంచదు. ఈసారి వంతు మానసి జోషిరాయ్‌కి వచ్చింది. 'కుసుమ్' సీరియల్ నుంచి ఆమెను తొలగించారు. ''నేనో పసిబిడ్డకి తల్లిని. నా కూతురు పట్ల నాకు కొన్ని బాధ్యతలున్నాయి. అందువల్ల సాయంత్రం ఆరు గంటల తరువాత పనిచేయడం నాకు కష్టం. ఈ విషయం ముందే చెప్పాను. కాని ఇబ్బంది పెట్టారు. నా టైం బాలేదు'' అని వాపోతోంది మానసి.

నొక్కితే భోజనం వస్తుంది.

ఉదయం పూట డాక్టర్లు వచ్చి పరీక్షిస్తున్నారు. ఏమాత్రం నలతగా వున్నా నర్సుని పర్యవేక్షించడానికి వుంచుతారు. కాని... కాని... అది అందమైన, సౌఖ్యవంతమైన బందిఖానా! తనకు యిల్లు అంటే చాలా మమత. తన తండ్రికి తాతగారు కట్టించి యిచ్చారు.

తల్లి డాక్టరు కావటంతో యింత యిల్లూ కావలసి వచ్చింది. తనకు వారసత్వంగా వచ్చిన యీ యిల్లంటే చిన్నతనంనుండీ తనకు మక్కువ.

బాల్యంలో క్రమశిక్షణ పేరుతో తల్లిదండ్రులు బలవంతంగా బోర్డింగుస్కూలుకి పంపినప్పుడు కూడా తల్లిదండ్రుల మీద బెంగకంటే యింటిమీదనే బెంగ ఎక్కువగా ఉండేది.

ఇల్లు, తోట తనకి అత్యంత ప్రియమైనవి. పెళ్లి అయాక భర్త లాయరు అవడం వలన, ప్రాక్టీసు తమ యింటిలోనే పెట్టడం వలన యిల్లు కళకళలాడుతూవుండేది. తన పిల్లలు పెరిగి పెద్దవారు అయి ప్రాజ్ఞులయ్యారు. భర్త పోయారు.

అన్ని సుఖాలూ యిక్కడే అనుభవించింది. అన్ని వేదనలలోనూ యీ యిల్లు తనకు వోదార్పునిచ్చింది. ఈ వృద్ధాప్యంలో పిల్లలు తనని వృద్ధాశ్రమానికి బలవంతాన తరలిస్తున్నారు.

తాను ఒంటరిగా వుండగలనని ఎంత చెప్పినా వినిపించుకోవడం లేదు.

మనసు లోపలి పొరలలో కూతురు వచ్చి తనను తీసుకొని వెడితే బాగుండునని వుంది.

కొడుకు ఈ దేశంలోనే వున్న మంచి ఉద్యోగాన్ని కొనసాగించవచ్చును కదా అనే వేదన.

తన భావాలు ఎవరికీ పట్టడం లేదు. గతం తప్ప భవిష్యత్తు లేని సాయంసంధ్యలో తన వర్తమానం వదిగి వుంది.

కళ్లల్లో నీటి బిందువులు తళతళలాడేయి. కంటిలో నీటిని కంటిలోనే అణచివేసుకొంది విశాలాక్షి. కంటిచుక్క జారి నేల మీద పడితే పుడమి తల్లి యీ హృదయజ్వాలను భరించలేదు.

ప్రకృతి కన్నెర్ర చేస్తే తన బిడ్డలకు క్షేమం కాదు. ఆ అశ్రుకణాన్ని నేలరాలకుండా కంటిలోనే అణచివేసుకుంది. తను వృద్ధాశ్రమానికి వెళ్లటానికి మనస్కరించడం లేదంటే కూతురు తన మీద తీవ్రంగా విరుచుకుపడింది.

''ఎప్పుడో మీ తాతలనాటి యిల్లది. వో అందమా చందమా? దెయ్యాల్లాంటి గదులు- అరణ్యంలాంటి తోట. శుభ్రంగా పడగొట్టి ఏ అపార్ట్

మెంటో కట్టిస్తే మంచిది.''

విశాలాక్షి మనోవేదన పిల్లలకి పట్టడం లేదు. ఇంటిని ఓ కంపెనీకి లీజుకు యిచ్చారు. తాను బతికుండగా అమ్మడానికి వప్పుకోనని నిష్కర్షగా చెప్పింది.

కొడుకు మరేమీ వాదన చేయకుండా లీజు డీడ్ ముందు తీసుకొని వచ్చి యిచ్చాడు.

మనుష్యులు లేకపోతే యిల్లుపాడుపడిపోతుంది. టేకు తలుపులూ, పెరట్లో మామిడి, కొబ్బరి చెట్ల కోసం అందరూ గోడలు దూకుతారు. ఇంట్లో దీపమైనా వెలగాలని సంతకం పెట్టేసింది విశాలాక్షి. తనకు బీపీ, సుగర్ వున్నాయి. కాదనలేని సత్యం.

కొడుకు తనని తీసుకొని వెళ్లనూ లేడు. ఇక్కడ వంటరిగా వదలనూ లేడు. అందుకని అతని డ్యూటీ అతను చేస్తున్నాడు. కొన్ని విషయాల్లో కోడలి మనస్సే మంచిదనిపిస్తుంది. వారం రోజుల క్రిందట కూతురితో ఫోన్‌లో చాలాసేపు మాట్లాడింది.

''అమ్మాయీ! నాకు హోంకి వెళ్లాలని లేదే. నన్ను నువ్వు వచ్చి తీసుకొని వెళ్లు. లేదా నేను పనివాళ్ళను పెట్టుకొని వుండగలను నువ్వు మూడేసి నెలలకు వోసారి వచ్చి నన్ను చూడు. నాకు యీ యిల్లంటే ప్రాణమే తల్లీ!''

కూతురు విసుక్కుంది.

''అమ్మా! నీ ఛాదస్తంతో మమ్మల్ని చంపుకొని తింటున్నావు. ఇక్కడ ఈ వాతావరణం నీకు జబ్బు చేస్తుంది. బి.పి. సుగర్ యీ జబ్బులతో బాధపడే నిన్ను ఆ లంకంత కొంపలో ఎట్లా వదిలేయగలం? అన్నయ్య చెప్పిన హోంలో రిటైరయిన అయ్యేఎస్ ఆఫీసర్లు, ఎన్నార్లైలూ వున్నారు. ఆ హోం వాళ్లు నిన్ను కంటికి రెప్పలా చూసుకుంటారు. అన్నయ్య మాటవిను. నేనూ వీలు చూసుకొని హోంకి వస్తానులే''

ఇంక కూతురి ధోరణి కూతురిదే కాని తన మాట వినిపించుకోదు. విశాలాక్షి ఆలోచనలు తెగిపోయాయి.

కోడలు అంటోంది.

''సెల్‌ఫోను మీ బేగ్‌లో పైన పెట్టాను. అక్కడ మీరు యిబ్బంది పడకుండా సిడీ రికార్డర్, కేసెట్స్ పేక్ చేసాను. అయినా రూంలో టివి వుంటుంది. ఈ యింటి అద్దె యిరవైవేలూ మీ ఎకవుంట్‌లో పడిపోతాయి. బేంకుపుస్తకాలన్నీ మీ పెట్టెలో పెట్టాను. ఇంకా ఏమన్నా సర్దమంటారా? మీ చీరలు ఆ రెండు సూట్‌కేసుల్లోనూ సర్దేను''

కొడుకు అన్నాడు

''అమ్మా! నేను కూడా నీతోవచ్చి వేరే బండిలో వెనక్కివచ్చేస్తాను. ఇంకా మా షాపింగు అవీ ఏమీ చేసుకోనేలేదు.''

విశాలాక్షి పేలవంగా నవ్వి అంది.

''నువ్వు యిక్కడ ఎక్కిస్తే చాలు కదరా! అక్కడ హోం వాళ్లు స్టేషన్‌కి కారు పంపిస్తారుగా''

కొడుకు చురుగ్గా చూసేడు.

''లేదు. నేను నిన్ను దింపి వస్తాను. ఇంకేమైనా కావలసివస్తే చెప్పు తను బజారుకి వెళ్లి తెస్తుంది.''

విశాలాక్షి మౌనంగా వుండిపోయింది. తనకి ఏం కావాలి? తన పసితనం యీ యింటిగోడలకి పట్టిపోయింది. తను తన వాళ్లకి ఏకసంతానం అవటంతో యింటిలో గది గదీ, తోటలో ప్రతీ చెట్టూ తన ప్రియనేస్తాలు అయిపోయాయి.

తన యౌవనం యీ యింట్లో విరగబూసింది. ఈ యింటనే అంగరంగ వైభవంగా తన వివాహం జరిగింది. భర్త ఓ రకంగా యిల్లరికంగా వచ్చేసి యిక్కడే స్థిరపడిపోయారు. పిల్లల పెళ్లిళ్లు యీ గృహప్రాంగణంలోనే జరిగాయి. భర్త గతించిన తరువాత కూడా, పిల్లలు చదువురీత్యా, ఉద్యోగ రీత్యా బయట పట్టణాలకు వెళ్లిన తాను వంటరిగానే వుంటూ వచ్చింది. కాని డెబ్బయ్యోపడిలో తనకు వున్న యీ అనువంశిక వ్యాధులతో తనని యిక్కడ ఒంటరిగా వుంచడానికి పిల్లలు అంగీకరించడంలేదు. వారి భవిష్యత్తు వారు తీర్చిదిద్దుకోవాలి. అది జీవన న్యాయం.

విశాలాక్షి నీరసంగా లేచింది. ప్రయాణం టైము దగ్గర పడుతోంది. ఇల్లంతా కలయతిరిగింది.

గున్నమామిడి చెట్టు నీడన కాసేపు కూర్చుంది.

ఉన్నదానిలో తన పిల్లలు సంతృప్తి చెందటం లేదు. పరుగులు వురుకులు యింకా యింకా ఏదో సాధించాలని తపన. ఈ పరుగు పందెంలా మానవీయ విలువలు ఎవరికి కావాలి?

సామాన్లన్నీ పనివాళ్లు కారులో సర్దేరు.

''మీ కళ్లజోడు యిదిగో'' అంటూ కోడలు అందించింది.

సావిట్లో వున్న తల్లిదండ్రుల ఫొటోలకు భర్త చిత్రానికీ నమస్కరించింది. సింహద్వారాన్ని కళ్లకద్దుకుంది. ఇల్లుని కన్నులలో నిండుగా నింపుకొంది. కారు ఎక్కింది.

కోడలు కారు డ్రైవ్ చేస్తోంది. కొడుకు ఆమె ప్రక్కన కూర్చున్నాడు. వెనక సీట్లో కళ్లు మూసుకుని కూర్చొంది విశాలాక్షి.

కనుకొనుకుల్లో నుండి జారిన నీటి బిందువుని నెమ్మదిగా కొనగోటన మీటేసింది.

కొడుకూ కోడలూ లండన్‌లో తాము చేపట్టబోయే పనుల గురించి ఇంగ్లీషులో గలగలా చర్చించుకుంటున్నారు. ఇల్లుని లీజుకి యిచ్చారు. తనని హోంకి అప్పగిస్తున్నారు. ఆధునిక యుగంలో యివి వారి ధర్మాలు!

చిన్నప్పుడు తన యిష్టానికి వ్యతిరేకంగా తల్లిదండ్రులు బోర్డింగుకి పంపితే, ఈనాడు కొడుకు వృద్ధుల వసతి గృహానికి తనను తరలిస్తున్నాడు.

ఆనాడు వారికి ఆ పని అత్యుత్తమైనదిగా తోచి వుంటుంది.

ఈరోజు కొడుక్కి తన కర్తవ్యం సక్రమంగా నెరవేరుస్తున్నాననే తృప్తిగా వుండి వుండవచ్చును.

మధ్యలో తన భావాలూ, ఆందోళనలనూ బాల్యంలో తల్లిదండ్రులూ గుర్తించలేదు. వృద్ధాప్యంలో కొడుకూ గమనించడంలేదు.

స్టేషన్ సమీపించింది.

బోగీలోనికి కొడుకు చేతి ఆసరాతో ఎక్కింది. ఏసీ బోగీ కావడాన చల్లగా వుంది. కాని మనస్సులో మండుతున్న కొలిమివంటి ఆలోచనలతో సన్నగా చిరుచెమటలు పోస్తున్నాయి.

కోడలు ఆందోళనగా అంది.

''బిపి పెరిగినట్లుంది. అత్తయ్యకి టాబ్లెట్ యివ్వండి''

కొడుకు యిచ్చిన మాత్రను నిర్లిప్తంగా నోటిలో వేసుకొని కోడలు అందించిన సీసాలోని నీళ్లను కాస్త కంఠంలో పోసుకొని తెప్పరిల్లింది విశాలాక్షి.

ఆవిడ ఆశలనూ, కోరికలనూ ప్లాటుఫారం మీదనే విడచేసి, ఆవిడ శరీరాన్ని మిగిలిన ప్రాణాన్నీ తన గుండెల్లో దాచుకొని రైలు బయల్దేరింది.

★

